క్లుప్తంగా

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి



కొణిదెన ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

బల్లికురవ: గ్రామాల వారీగా ఉపాధి పనులు చేసే కూలీలకు పని ప్రదేశంలోనే వసతులు కల్పించాలని ఎంపీడీఓ కుసుమకుమారి ఆదేశించారు. మంగళవారం కొణిదెన గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆమె పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఉదయం 7 గంటలకు పని ముట్లతో పనిచేసే ప్రదేశాలకు చేరి 10 గంటల కల్లా మస్టర్ వేయించుకుని ఇంటికి తిరిగి వెళ్లాలన్నారు. పనిచేసే ప్రదేశంలో తాగునీరు, ఫస్టు ఎయిడ్ కిట్‌లు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఎంపీఓ టెక్నికల్ అసిస్టెంట్ ఫీల్డ్ అసిస్టెంట్‌లను కోరారు. కొండాయపాలెం, చెన్నుపల్లి, ముక్తేశ్వరం గ్రామాల్లో ఎండల తీవ్రత దృష్ట్యా చనిపోవటం బాధాకరమని ఇలాంటి ఘటనలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని హామీ పథక సిబ్బందిని కోరారు.

రైతు ఉత్పత్తిదారుల గ్రూపులను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న ఎఫ్‌పీఓ ఏపీఎం చిన్నయ్య

ఇంకొల్లు(చినగంజాం): రైతు ఉత్పత్తిదారులతో మహిళా గ్రూపుల ఏర్పాటు చేసి వాటిని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని జిల్లా రైతు ఉత్పత్తి దారుల అధికారి, ఏపీఎం ఆర్ చిన్నయ్య సూచించారు. మంగళవారం మండలంలోని ఇంకొల్లు వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో రైతు ఉత్పత్తిదారులపై అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎఫ్‌పీఓ ఏపీఎం ఆర్ చిన్నయ్య మాట్లాడుతూ మండలంలో ఎఫ్‌పీజీ కొత్త గ్రూపులు ఏర్పాటు చేయాలని, ఉన్న గ్రూపులను బలోపేతం చేయాలని, ప్రతి ఎఫ్‌పీజీ నుంచి సభ్యత్వం, వాటాధనం వసూలు చేసి మండల పరిధిలో ఎఫ్‌పీఓలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. షేడ్ నెట్ వేసుకునే రైతులు ముందుకు వస్తే ఖేతి సంస్థ ఆధ్వర్యంలో షేడ్ నెట్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు, వ్యాపార నిమిత్తం మొబైల్ వ్యాన్ కూడా సబ్సిడీ రూపంలో ఇస్తామని తెలిపారు. ఇంకొల్లు ఏపీఎం అనురాధ మాట్లాడుతూ ఎఫ్‌పీజీ అంటే ఫార్మర్ ప్రొడ్యూసర్ గ్రూప్ అని మన మండలంలో కనీసం 200 గ్రూపులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ మీటింగ్ ప్రతి నెల 6 వ తేదీన షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని తెలిపారు. బోర్డు ఆఫ్ డైరెక్టర్స్, సీసీలు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయండి

చీరాల టౌన్: అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందించే బాధ్యత అధికారులపై ఉందని ఎంపీడీఓ శివసుబ్రహ్మణ్యం సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని అన్ని సచివాలయాల సెక్రటరీలు, వివిధ శాఖల ఉద్యోగులతో ఎంపీడీఓ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. మండలంలోని 15 గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులు, ఎన్ఆర్ఈజీఎస్ పనుల వివరాలు, కూలీల జాబ్‌కార్డులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీలు అందరికీ పనులు కల్పించాలన్నారు. మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు అందరు సమన్వయంగా పనిచేసి ప్రభుత్వం అందించే పథకాలను అర్హులైన ప్రతి పేదవాడికీ అందించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య శాఖల అధికారులు, సిబ్బంది విధులను సమర్థవంతంగా నిర్వహిస్తేనే సత్ఫలితాలు సాధించవచ్చన్నారు. ఈవోఆర్డీ రామకృష్ణ, సచివాలయాల ఉద్యోగులు, పంచాయతీల సెక్రటరీలున్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం సద్వినియోగం చేసుకోండి

చినగంజాం: వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని చినగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి. రత్నకుమారి అన్నారు. మంగళవారం ఆమె స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని సందర్శించి పరిశీలించారు. విద్యార్థులు శిక్షణా శిబిరంలో ప్రధానంగా చదవడం, రాయడం నేర్చుకోవాలని బాషా పరిజ్ఞానాన్ని పంచుకోవాలని సూచించారు. గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాన్ని పెంచుకోవడంతో పాటు పూర్తి జ్ఞానాన్ని సముపార్జించేందుకు కృషి చేయాలని సూచించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు గత నెల 28 వ తేదీ నుంచి జరుగుతుండగా ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా కంప్యూటర్, యోగా, స్పోకెన్ ఇంగ్లిషు, జనరల్ నాలెడ్జిపై విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నట్లు గ్రంథపాలకుడు అళహరి మోహన లక్ష్మీ నరసింహా చార్యులు వివరించారు. జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు ఎస్. నరసింహారావు ఇంగ్లిషులో మెళకువలు, స్పోకెన్ ఇంగ్లీషు, వొకబులరీ డెవలప్‌మెంట్, లాంగ్వేజ్ గేమ్స్ ద్వారా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన నిర్వహిస్తున్నారు. అదే విధంగా కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని ఉపాధ్యాయుడు యర్రవరపు రామాంజనేయులు విద్యార్థులకు బోధిస్తున్నారు. కథలు, దేశభక్తి గీతాలు, సృజనాత్మక అంశాలతో శ్రీనివాసరావు, జనరల్ నాలెడ్జ్ బోధనతో ఆర్ పోతురాజులు విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాల్లో బోధిస్తున్నారని గ్రంథపాలకుడు వివరించారు.



జలబిందెలతో పోలేరమ్మ అమ్మవారికి ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు



పోలేరమ్మ అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న గ్రామ పెద్దలు



ఆలయ ప్రాంగణానికి ఊరేగింపుగా వస్తున్న భక్తులు

కాపాడమ్మా.. సోపిరాల పోలేరమ్మా!



అమ్మవారికి జలాభిషేకం

- ఘనంగా తిరునాళ్ల
- భారీ సంఖ్యలో హాజరైన భక్తులు

చినగంజాం: మండలంలోని సోపిరాల గ్రామ దేవత పోలేరమ్మ తిరునాళ్ల మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. మంగళవారం గ్రామంలోని మహిళలు పసుపు, కుంకుమలతో నీళ్ళబిందెలతో గ్రామంలోని ప్రధాన వీధుల్ల ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాలతో డప్పు వాయిద్యాలతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి జలాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంభాభిషేకం జరిగింది. భక్తులు వందల సంఖ్యలో పాల్గొని తమ మొక్కులను తీర్చుకున్నారు. పల్లపోలు వంశీయులు ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి పూజా కార్యక్రమాలను నిర్వహించి, మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం మేళతాళాలతో శ్రీ లలితా రామకోటేశ్వర మహిళా కోలాట బృందం ఆధ్వర్యంలో కోలాటాలతో, మేళతాళాలతో విద్యుత్ ప్రభ ఊరేగింపు నిర్వహించారు. రాత్రి అమ్మవారి ఆలయం వద్ద తిరునాళ్ల జరిగింది. ఆలయ ప్రాంగణంలో 70 అడుగుల విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. అనంతరం నెల్లూరు మాధవ ఈవెంట్స్‌వారిచే పాటకచ్చేరి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమానికి హాజరైన భక్తులు

కార్మికులను తొలగించవద్దు



మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కాత్యాయని

చీరాల రూరల్: పెద్ద కర్మాగారాలు, సంస్థల్లో పని చేస్తున్న కార్మికులను సరైన కారణాలు చూపకుండా విధుల నుంచి తొలగించవద్దని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జె. కాత్యాయని అన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు అంతర్జాతీయ కార్మిక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కొత్తపేటలోని కేఎస్ఆర్ హ్యాండ్లూమ్స్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కార్మికులకు అవగాహన.. న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ముఖ్య అతిథిగా న్యాయమూర్తి కాత్యాయని పాల్గొని మాట్లాడారు. ఏ సంస్థలోనైనా 20 మందికి మించి కార్మికులు పనిచేస్తుంటే వారు తమ హక్కుల కోసం కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసుకుని యాజమాన్యాలతో చర్చలు, సంప్రదింపులు చేసుకోవచ్చునని సూచించారు. యాజమాన్యాలు సరైన కారణాలు చూపకుండా కార్మికులను తొలగించినప్పుడు, వారికి రావాల్సిన వేతనాలు తగ్గినప్పుడు యాజమాన్యాలను ప్రశ్నించే హక్కు కార్మికులకు ఉందని తెలిపారు. అలానే కార్మికులకు ఎటువంటి సమస్యలు వచ్చినా మండల న్యాయ సేవాధికా సంస్థ దృష్టికి తీసుకువచ్చి న్యాయ సహాయం పొందవచ్చునని చెప్పారు. ముఖ్యంగా మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. రమేష్‌బాబు మాట్లాడుతూ కార్మికులకు పనిగంటలు కచ్చితంగా యాజమాన్యాలు అమలు చేయాలని సూచించారు. మహిళా న్యాయవాది జి. ఈశ్వరి రెడ్డి మాట్లాడుతూ పురుష కార్మికులతో సమానంగా మహిళా కార్మికులకు వేతనాలు ఇవ్వాలని సూచించారు. మహిళా కార్మికులను లైంగిక వేధింపులకు గురిచేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటారని చెప్పారు. సదస్సులో బార్ అసోసియేషన్ సెక్రటరీ ఎం. రవికుమార్, టూటౌన్ ఎస్సై రాంబాబు, హ్యాండ్లూమ్స్ మేనేజర్ రవిబాబు, న్యాయసేవాధికార సంస్థ వీర రాఘవులు, పీఎల్‌వీ డి. ఇమ్మానియేలు, పోలీసు సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వద్దు



కారంచేడులో డాక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఎన్‌ఎంలు

చీరాల టౌన్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు అనారోగ్యాలకు గురికాకుండా చేయడంతో పాటు ప్రజల ఆరోగ్య స్థితిగతులు నమోదు చేయాలని పీహెచ్‌సీ వైద్యులు శ్రీదేవి సూచించారు. మంగళవారం ఈపురుపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామ పంచాయితీల్లోని ఆశ కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. వైద్యురాలు మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు విధులను సమర్థవంతంగా నిర్వహించి గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముందస్తుగా వైద్యశిబిరాలను నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. పీహెచ్‌సీలోని సూపర్‌వైజర్లు, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఏఎన్ఎంలపై పనిభారం తగ్గించాలి

కారంచేడు: ఏఎన్ఎంలపై పనిభారం తగ్గించాలని, మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలని ఏఎన్ఎంలు మంగళవారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. గత రెండు, మూడు రోజుల నుంచి ఎంఎల్‌హెచ్‌పీలు (సీహెచ్‌ఓ), ఏఎన్ఎంల మధ్య మాటల యుద్ధం జరుగుతోందన్నారు. ఇద్దరి వాదనలకు ఊతం ఇచ్చేలా ఏఎన్ఎంలకు ఒక వర్గం యూనియన్, ఎంఎల్‌హెచ్‌పీలకు మరో యూనియన్ మద్దతుగా నిలుస్తున్నాయని తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీలు హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇమ్యూనైజేషన్, ఆర్‌సీహెచ్ పోర్టల్ నిర్వహణతో పాటు, యాప్‌లను అత్యధిక బాగం ఏఎన్ఎంలే నిర్వహిస్తున్నారని, అయినా ఇన్‌సెంటివ్‌లు మాత్రం వారికి ఇస్తున్నారని రాష్ట్ర వ్యాప్తంగా ఏఎన్ఎంలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. అయినా ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లపై వారు లేనిపోని ఆభాండాలు వేస్తుండటం సమంజసం కాదని వారు పేర్కొన్నారు. పని ఒత్తిడితో అనేక ప్రాంతాల్లో ఏఎన్ఎంలు బలవన్మరణాలకు పాల్పడే పరిస్థితులను కూడా వారు గుర్తు చేశారు. అనంతరం డిమాండ్లతో కూడాని వినతిపత్రం స్థానిక మెడికల్ ఆఫీసర్ జి. సురేష్‌బాబుకు అందించారు. నల్ల బ్యాడ్జీలతోనే వారు విధులకు హాజరయ్యారు. పీహెచ్‌సీ పరిధిలోని ఏఎన్ఎంలతో పాటు, ఆశాలు కూడా పాల్గొన్నారు.

విద్యపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ సురేష్‌బాబు

కారంచేడు: గ్రామాల్లో బాల్య సంరక్షణతో పాటు, బాల్య విద్యలపై ప్రజల్లో పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని, అందుకు ఏఎన్ఎంలు, ఆశాలు వారిలో చైతన్యం కల్పించాలని మెడికల్ ఆఫీసర్ జి. సురేష్‌బాబు అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రమైన కారంచేడు పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సిబ్బంది సమావేశంలో మాట్లాడారు. ఎర్లీ చైల్డ్‌హుడ్ డెవలప్‌మెంట్ (ఈసీడీ)పై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రజల్లో చైతన్యం కల్పించాలన్నారు. సూపర్‌వైజర్ శ్రీనివసరావు, జ్యోతిరాణి, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు. స్వర్ణ పీహెచ్‌సీలో నోడల్ ఆఫీసర్ మాధురీసిఫోరా ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈఓ వి. నాగేశ్వరరావు, హెచ్‌ఈ మీనాకుమారి పాల్గొన్నారు.

హోరాహోరీగా టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్



బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న బండారు ప్రభాకరరావు

ఇంకొల్లు(చినగంజాం): గాదె వీరారెడ్డి మెమోరియల్ ప్రీమియర్ లీగ్ సీజన్1లో రెండో రోజు పోటీలలో మూడు మ్యాచ్‌లు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు, గ్రామ సర్పంచ్ బొల్లెద్దుల లుధియమ్మ క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్ వేసి మ్యాచ్‌లను ప్రారంభించారు. మొదటి మ్యాచ్ ఇంకొల్లు స్టాలిన్ యూత్, తాటివర్తి వారి పాలెం మధ్య నిర్వహించారు. ఇంకొల్లు స్టాలిన్ పేట యూత్ జట్టు 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. అదే విధంగా రెండో మ్యాచ్ సూదివారిపాలెం, ఇంకొల్లు ఎస్ఎస్ఎల్ జట్ల మధ్య నిర్వహించగా 16 పరుగులు తేడాతో సూదివారిపాలెం జట్టు గెలుపొందింది. మూడో మ్యాచ్ వలపర్ల, ఈదుమూడి క్రికెట్ జట్ల మధ్య హోరాహోరిగా జరిగింది. కోటి శ్రీరాములు, పులఖండం రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ వలేరు చిట్టిబాబు, ద్రోణాదుల సర్పంచ్ వంకాయలపాటీ బాగ్యారావు, గ్రామ పెద్దలు, అభిమానులు, యువకులు పాల్గొన్నారు.

అర్జీల విచారణ సత్వరం చేయండి

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహసీల్దార్ కుర్రా గోపికృష్ణ సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాసు పుస్తకాలు, పీజీఆర్ఎస్ అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో, సచివాలయాల్లో పనిచేసే వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు స్పందన అర్జీలను త్వరగా విచారించాలన్నారు. ప్రజలకు జవాబు దారీతనంగా రెవెన్యూ ఉద్యోగులు పనిచేయాలని, విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాస్ పుస్తకాలను త్వరగా అందించడంతో పాటు గ్రామాల్లో ఎక్కడా కూడా అనధికార లేఅవుట్లు వేయకుండా కట్టడి చేయడంతో పాటు నీటి తీరువా వసూళ్లు చేయాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో డీటీ సుశీల, ఆర్ఐలు శేఖర్, సత్యం, వీఆర్వోలున్నారు.

అన్నదాత సుఖీభవకు 19,599 మంది

అద్దంకి రూరల్: మండలంలో 19599 మంది రైతులు వెబ్‌ల్యాండ్‌లో నమోదయ్యారని మండల వ్యవసాయాధికారి కె. వెంకటకృష్ణ మంగళవారం తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకాలతో సంప్రదించాలన్నారు.

14న మండల సర్వసభ్య సమావేశం

మేదరమెట్ల: కొరిశపాడు మండల పరిషత్ సర్వసభ్యసమావేశం ఈనెల 14వ తేదీ ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజ్యలక్ష్మీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స మావేశానికి అన్ని శాఖల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

ఆశ వర్కర్లు సమ్మె నోటీసు అందజేత



సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశ వర్కర్లు

అద్దంకి రూరల్: ఆశా వర్కర్ల సమస్యల పరిష్కరించాలని కోరుతూ మే20 న నిర్వహించనున్న సమ్మెను తెలియజేస్తూ మంగళవారం అద్దంకిలోని గాజుల పాలెం యూపీహెచ్ వైద్యాధికారికి సమ్మె నోటీసు అందజేశారు. సమస్యలు పరిస్కారం అయ్యేవరకు సమ్మె చేస్తామని స్పష్టం చేశారు.

మారుతీ భవన్ ఆధునికీకరణకు విరాళాలు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండలోని దేవస్థాన గెస్ట్ హౌస్ మారుతి భవన్ ఆధునీకరణకు దాతలు మంగళవారం విరాళాలను దేవస్థాన ఏసీ తిమ్మనాయుడుకు అందజేశారు. అద్దంకికి చెందిన మారుతి ఫ్యాషన్స్ షేక్ రఫీ, సైదాభి, దంపతులు, మేడగం అంజిరెడ్డి, వెంకటరాజ్యం, నాగసూరి హనుమత్ ప్రసాద్, పుష్పావతిలు విరాళాలు అందజేశారు.

రాతిముఖ మండపానికి..

అద్దంకి పట్టణానికి చెందని మేకా వెంకటేశ్వర్లు అల్లుడు ధర్మవరపు భాస్కర రావు, సుజాతలు రాతి ముఖ మండప నిర్మాణానికి రూ. 1,01,116 దేవస్థాన ఏసీకి అందజేశారు.

రైతులకు అవగాహన



అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ ప్రతినిధులు

మేదరమెట్ల: ఖరీఫ్‌లో సాగు చేయడంపై రైతులకు అవగాహనా కార్యక్రమాన్ని మంగళవారం కొరిశపాడు మండలం పి.గుడిపాడు గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. నవధాన్యాలను పండించడం.. ప్రకృతి వ్యవసాయం చేయడం వివరించేలా శ్లోగన్లు ఇస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. యూనిట్ ఇన్‌చార్జి ఏ.శ్రీనివాసరావు, వీఏవోసునీత, ఐసీఆర్‌పీసీ మౌనిక, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్ చైర్స్ పంపిణీ



దివ్యాంగులకు వీల్ చైర్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

జె.పంగులూరు: రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు ఆధ్వర్యంలో మంగళవారం పంగులూరులోని రోటరీ భవనం వద్ద వికాలాంగులకు వీల్ చైర్లు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ సంయుక్త ఆధ్వర్యంలో, షార్ ప్రాజెక్టు వారి సహకారంతో ఈ వీల్ చైర్‌ను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు అధ్యక్ష, కార్యదర్శులు షేక్ కాలేషా వలి, డాక్టర్ బత్తుల వీరనారాయణ మాట్లాడుతూ రోటరీ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఇప్పుడు వికలాంగులకు వీల్ చైర్స్‌ను ఇస్తున్నామని తెలిపారు. కొండమంజులూరు స్కూల్ విద్యార్థికి, మరో మహిళలకు వీల్‌చైర్లు అందించారు. మరో మూడు చైర్లు పంగులూరు క్లబ్‌కు అవకాశం ఉన్నప్పటికీ లబ్ధిదారులు లేని కారణంగా ఇవ్వడం లేదని తెలిపారు. చైర్మన్ చిలుకూరి వీరరాఘవయ్య, జాగర్లమూడి సుబ్బారావు, రాయిణి రామారావు, గుర్రం ఆంజనేయులు, ఇమ్మడిశెట్టి సుబ్బారావు, పోతిని ప్రసాద్, ఖాశీంఖాన్, రాఘవ రెడ్డి, వి. నరసింహారావు, రావూరి శ్రీనివాసరావు, కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శిడి మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న తోటవారిపాలెం పోలేరమ్మ తల్లి



మజ్జిగ పంపిణీ చేస్తున్న చిత్రం

చీరాల టౌన్: భక్తుల పాలిట కొంగు బంగారంగా ఉండే తోటవారిపాలెం శ్రీ పోలేరమ్మ తల్లి 56వ శిడి మహోత్సవం, తిరునాళ్లను మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా శిడి పెళ్లి కొడుకుతో ఊరేగింపుగా అమ్మవారి గుడికి వెళ్ళి గుడి వద్ద ఉండే శిడి మానుకు ఒక పెట్టెలో మేకపోతును ఉంచి గుడి చుట్టూ మూడు ప్రదక్షిణలు చేయించారు. ఈ సమయంలో శిడిమాను పైభాగంలో చెక్కపెట్టెలో ఉంచిన మేకపోతును భక్తులు జీడికాయలతో కొట్టారు. శిడిమాను లాగితే కష్టాలు తొలిగిపోతాయని భావించే భక్తులు శిడి మాను బండిని లాగేందుకు పోటీ పడ్డారు. పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా ప్రత్యేకంగా విద్యుత్ ప్రభలు ఆకర్షణగా నిలిచాయి. విద్యుత్ ప్రభలతో పాటు మ్యూజికల్ నైట్ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. తిరునాళ్ల సందర్భంగా తోటవారిపాలెం పరిసర గ్రామాల్లోని పశుపోషకులు తమ పురస్కరించుకొని పశుసంపదతో పాటు వాహనాలను గుడి చుట్టూ తిప్పి ప్రజలు తమ మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి అధికసంఖ్యలో భక్తులు బారులు తీరారు. డీఎస్పీ మోయిన్ పర్యవేక్షణలో రూరల్ సీఐ శేషగిరిరావు, రూరల్ ఎస్సై చంద్రశేఖర్‌లతో పాటు ఏఆర్, సివిల్ పోలీసులతో భారీగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. తిరునాళ్లకు వచ్చిన భక్తులకు పలు స్వచ్ఛంద సంస్థలు మంచినీరు, మజ్జిగ పంపిణీ చేశారు.

స్టడీ అవర్స్‌తో పది విద్యార్థులకు ఉపయోగం

చినగంజాం: ఈ ఏడాది పదో తరగతి తప్పిన విద్యార్థులు పాఠశాలలో నిర్వహిస్తున్న స్టడీ అవర్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని పర్చూరు డిప్యూటీ డీఈఓ గంగాధర్ సూచించారు. మంగళవారం ఆయన చినగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని వన్స్ పెయిల్డ్ విద్యార్థుల స్టడీ అవర్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. తప్పిన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బోధనను అందరూ సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ఉపాధ్యాయులు స్వయంగా ఉండి స్టడీ అవర్స్‌ను నిర్వహిస్తున్నారని తెలియజేశారు. విద్యార్థులకు ఆయన పరీక్షల్లో నిర్వహించాల్సిన పలు అంశాలను గురించి వివరించారు. అనంతరం పాఠశాలలో జేవీకే కిట్లు నిల్వలను పరిశీలించారు. విద్యార్థిని, విద్యార్థులకు వచ్చిన బెల్టులు తదితర అంశాలను నాణ్యతా పరంగా పరిశీలించారు. పాఠశాల హెచ్‌ఎం డి. రత్నకుమారి, ఇంగ్లిషు ఉపాధ్యాయుడు ఎస్. నరసింహారావు, లెక్కల ఉపాధ్యాయుడు నాసిక సూర్యనారాయణ, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ ఎం. మురళి, సీఆర్పీ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మఠం బయలుదేరిన స్వాములు

బల్లికురవ: భక్తి శ్రద్ధలతో 40 రోజుల పాటు మండల దీక్ష చేపట్టి మంగళవారం చిన అంబడిపూడిలో సుమారు 40 మంది స్వాములు కడప జిల్లాలోని బ్రహ్మంగారి మఠం బయలుదేరి వెళ్లారు. గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడులు కట్టారు.